కాదా? ఎందుకే అందరూ నా ప్రాణాలు తోడెయ్యటానికి తయారయ్యారు'' అత్తగారి మీద కోపం శిరీష మీద చూపిస్తూ గుడ్డలు ఆరేయటానికి డాబా పైకి వెళ్లింది. అమ్మ వచ్చేవరకు ఆగలేనట్టు టేబుల్‌పై దుప్పటి పరిచి ఐరన్‌బాక్స్ తీసుకొచ్చింది శిరీష.

“శిరీ తొందరెందుకే అమ్మ వచ్చి చేస్తానంది కదా? వద్దమ్మా'' అన్నారు కాంతమ్మ.

“నువ్వుండు నానమ్మా నాకు తెలుసులే'' అంటూ నానమ్మ మాటలు లెక్కచేయకుండా ఐరన్ బాక్స్ టేబుల్‌పై ఉంచి స్విచ్ ఆన్ చేసి వేడెక్కిందో, లేదోనని చెయ్యి పెట్టింది అంతే కెవ్వున కేకేసింది. కాంతమ్మగారికి ఏం చేయాలో పాలుపోలేదు. ఒక్క నిమిషం కంగారుగా అటుఇటూ తిరుగుతూ ఏదో తట్టినట్టు, తన చేతి కర్ర తీసి శిరీష చెయ్యి మీద ఒక్కటేశారు. అంతే సొమ్మసిల్లి పడిపోయింది శిరీష. వెంటనే తన కర్రతోనే ప్లగ్ తీసేశారు. ఇదంతా చూస్తున్న వంశీ పైకి పరుగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వెళ్లి “మమ్మీ శిరికి కరెంట్ షాక్ కొట్టింది'' ఆయాసపడుతూ చెప్పాడు. కంగారు పడుతూ కిందికి దిగివచ్చింది సుచిత్ర. కూతురు సొమ్మసిల్లి పడి ఉండటం చూసి “అమ్మా శిరీ ఏమయిందమ్మాలే'' కంగారుగా వంశీని నీళ్లు తెమ్మంది. ఫ్రిజ్‌లోంచి బాటిల్ తీసివ్వగానే మొహంమీద చల్లింది. మెల్లగా కళ్లు తెరిచి లేచి కూర్చుంది శిరీష.

సుచిత్ర కంగారు కాస్త కోపంగా మారిపోయింది. “ఎందుకే ఇంత తొందర నీకు, నేనొచ్చి చేసిస్తానన్నాను కదా? ఏమైనా అయ్యుంటే'' అంటూ ఆ చెంపా, ఈ చెంపా వాయించి కన్నీళ్లు తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది సుచిత్ర. బిత్తరచూపులు చూస్తూ కూర్చున్న శిరీషను కాంతమ్మగారు దగ్గరకు తీసుకొని ఓదార్చారు. వంశీ వంటింట్లో అమ్మ దగ్గరకు వెళ్లి “నానమ్మ చెబుతున్నా కూడా వినలేదమ్మా ఇది'' అన్నాడు వంశీ. మారు మాట్లాడలేదు సుచిత్ర. వంశీ కాంతమ్మగారి దగ్గరకొచ్చి “థ్యాంక్స్ నానమ్మా నువ్వే శిరీని కాపాడావు'' వంశీ అంటున్న మాటలు వంటింట్లో పిల్లలకు పాలు కలుపుతున్న సుచిత్ర చెవిన పడ్డాయి.

“అవును నానమ్మా. శిరీకి షాక్ కొట్టిన వెంటనే కర్రతో కొట్టాలనే ఐడియా నీకెలా తట్టింది'' ఆసక్తిగా అడిగాడు వంశీ.

“ఓ అదా. నిన్న సాయంత్రం 'చిచ్చరపిడుగు' సీరియల్‌లో మనవడికి షాక్ కొడితే తాత ఇలాగే కొట్టి రక్షిస్తాడు, అది గుర్తొచ్చి అలా చేశాను నాన్న'' ముసిముసిగా నవ్వుతూ అన్నారు కాంతమ్మగారు. అత్తగారి మాటలు విన్న సుచిత్రకు నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు. మొత్తానికి తన బిడ్డను ఓ గండం నుంచి కాపాడారు అనుకుంటూ కాఫీ కలిపి తీసుకొచ్చి “తీసుకోండత్తయ్యా'' అంది. కోడలి మాటల్లో కరుకుదనం పోయి, చల్లదనం ఉండటంతో కోడలి వంక చూశారు. కోడలి చూపుల్లో నా కూతురిని కాపాడారు అన్న కృతజ్ఞతాభావం కొట్టొచ్చినట్టు కనిపించటంలో కాంతమ్మగారి కళ్లు విజయగర్వంతో మెరిశాయి. 'చూశావా టీవీ చూస్తే నష్టాలే కాదు, కొన్ని లాభాలు కూడా ఉంటాయి' అనుకుంటూ కోడలి వంక చూసి ముసిముసిగా నవ్వారు. అత్తగారి నవ్వుతో తను శృతి కలిపింది సుచిత్ర.

**-ఎస్.కె.సన్ని (శ్రీకాళహస్తి)**

# తారకమంత్రం

**పూజా మందిరంలో బామ్మ మడిబట్టలు కట్టుకుని రాముని పటం ఎదురుగా పెట్టుకుని ఆ స్వామి వేపు తదేకంగా చూస్తూ ఏవో మంత్రాలు మెల్లగా ఉచ్చరిస్తూ రెండు చేతులతో మెల్లగా చప్పట్లు చరుస్తూ భజన చేసుకుంటోంది.**

బామ్మ భజన చూసిన పదేళ్ల వాణి కెవ్వున అరిచింది.

ఆ అరుపు విన్న బామ్మ ఈ లోకంలోకి వచ్చి నున్నని గుండు మీద తెల్లటి పంచె జారిపోతుంటే సరిచేసుకుని ముక్కుమీద కళ్లద్దాలు కళ్లవేపు నెట్టి కోపంగా చిరాగ్గా “ఓసి గుంటకాన నువ్వటే పో అవతలకి'' అంటూ గట్టిగా కసిరింది.

వాణి హుటాహుటిన వంటింట్లో ఉన్న శకుంతల దగ్గరకొచ్చి “అమ్మా చూడవే బామ్మ ఎలా పూజ చేస్తోందో'' అంటూ ఫిర్యాదు చేసింది.

“సరేలే ఆవిడేదో రామా కృష్ణా అనుకుంటోంది. నువ్వెందుకెళ్లావ్ అక్కడికి?'' తల్లి మందలించింది.

అప్పుడే బయట నుండి ఇంట్లోకి వస్తున్న సురేష్‌తో “ఒరే అన్నయ్యా ఒక్కసారిలారా దేవుని గదిలో బామ్మ భజన విందువుగానీ'' అంటూ రెక్క పట్టుకుని లాక్కెళ్లింది.

సురేష్ ఆ భజన విని వాణి కంటే పెద్దగా అరిచాడు. ఇద్దరూ పకపక నవ్వుకుంటున్నారు.

బామ్మకి మరింత పిచ్చెక్కినట్లయింది. “గడుగ్గాయి వెధవలు. ఒకరికి ఇద్దరు తోడైనారు. చదువూ సామూ లేదా.. ఇంట్లో ప్రశాంతత లేకుండా పోతోంది. కాస్త పూజ కూడా చేసుకోనివ్వరూ'' బామ్మ మళ్లీ దీర్ఘాలు తీసి భజనలో నిమగ్నమయింది.

అప్పుడే పిల్లలను మందలించాలని వచ్చిన శకుంతల కూడా ఆవిడ భజనకు మరింత పగలబడి నవ్వింది.



'వాళ్లంటే అజ్ఞానం వెధవలు. ఈవిడకేమొచ్చింది' ఈసారి బామ్మ కోపం తారాస్థాయికి చేరి ఆ ముగ్గురి వేపు కొరకొరా చూసింది. “ఏంట్రా.. ఏంటి సంగతి ఎందుకిలా నవ్వుతున్నారు'' ఉండబట్టలేక బైటకనేసింది.

బైట పేపరు పఠనంలో ఉన్న చక్రధరరావు వారి దగ్గరకొచ్చి “ఏం జరిగింది'' భార్యనుద్దేశించి అడిగాడు.

“ఒక్కసారి మీ అమ్మగారి భజన వినండి'' అంది శకుంతల ఇంకా నవ్వుతూనే.

చక్రధరరావు మెల్లగా పూజా మందిరంలోకి వెళ్లి వెనుకవేపు నిలబడి కొంచెం దగ్గరగా ఆమె మంత్రాలు విన్నాడు. అతనికీ నవ్వాగలేదు.

సరిగ్గా అప్పుడే అరగంట క్రితం పోయిన కరెంట్ వచ్చింది. పిల్లలు టేప్ రికార్డర్‌లో పెట్టిన కేసెట్ మళ్లీ ఊపందుకుంది.

చక్రధరరావుకో విషయం అర్థమయింది.

తెల్లవారి రోజూ టేప్ రికార్డర్‌లో రాముని పాటలు పెట్టి వినడం అలవాటు. ఆ రోజూ అలాగే ఓ కేసెట్ పెట్టాడు. తరువాత పిల్లలు మరో కేసెట్ మార్చేసి ఉంటారు. సగం పాటలో కరెంటు పోయి అప్పుడు మిగతా పాట వస్తోంది. పాపం ఏ భక్తుడో తనలాగే కీళ్ల నొప్పులు - వాతపట్లుతో బాధపడుతూ రాముని మీద భక్తితో ప్రార్థిస్తున్నాడు కాబోలు అనుకుని ఆ రాముడు తన బాధలు కూడా తగ్గించకపోతాడా అని భావించి పూనకం పట్టినట్టు అత్యంత భక్తి శ్రద్ధలతో-

“నొప్పి నొప్పి ఒళ్లంత నొప్పి గిల్లి గిల్లి గిచ్చేస్తది
పట్టిపట్టి నరాలు మెలేసి...
ఆ దేవ దేవ దేవ దేవ దేవ దేవుడా-
దేవ దేవ దేవ దేవ దేవ దేవుడా...'' అంటూ
బామ్మ భజన ప్రారంభించింది మళ్లీ.

అది ఈమధ్య విడుదలైన కొత్త సినిమా పోకిరి పాటని పాపం ఆమెకేం తెలుసు. ఆ పాటని భక్తిభావంతో ఆవిడ బాణీలో పాడుతుంటే- అందరూ కోరస్‌గా నవ్వారు.

తరువాత బామ్మకు వారి ద్వారా అసలు విషయం అర్థమయి తెగ సిగ్గుపడిపోయింది.

**-ఐ.ఏ.నరసింహం (గుమ్మలక్ష్మీపురం)**